
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 4 ఏప్రిల్ 2025


అమరావతిలో స్టార్టప్ ఏరియా (ఊహాచిత్రం)

స్టార్టప్ ఏరియా అభివృద్ధికి.. జీవం

"అమరావతి అభివృద్ధిపై సింగపూర్ ప్రత్యేకంగా ఆసక్తి చూపుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలోనూ ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో సింగపూర్ సంస్థలు అమరావతి అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలో రాజధానిలో సింగ్‌పూర్ ప్రతినిధి బృందం పర్యటించడం.. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ కావడంతో.. స్టార్టప్ ఏరియా అభివృద్ధి తాజాగా తెరపైకి వచ్చింది. స్టార్టప్ ఏరియా అభివృద్ధి ప్రణాళికకు మళ్లీ జీవం పోసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 40కిపైగా దేశాల్లో స్టార్టప్ ఏరియాలను అభివృద్ధి చేసిన సింగపూర్ సంస్థలు అమరావతిని కూడా అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని పలువురు ఎదురుచూస్తున్నారు. ఏదేమైనా అమరావతి స్టార్టప్ ఏరియా అభివృద్ధి గురించి మరికొద్ది రోజుల్లోనే మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉంది."

- సింగపూర్ బృందం రాకతో చిగురిస్తున్న ఆశలు
- సరికొత్తగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై చర్చలు
- ఆర్థిక లావాదేవీలకు ప్రధాన కేంద్రంగా చేయాలని లక్ష్యం



అమరావతిలో స్టార్టప్ ఏరియా

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతి అభివృద్ధికి అందివచ్చే ఏ ఒక్క అవకాశాన్ని కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వదులడం లేదు. 2014-19లో అమరావతి నగర ప్రణాళికను మూడు దశలుగా అభివృద్ధి చేయాలన్న మాస్టర్‌ప్లానును ఇప్పుడు ఏకకాలంలో సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్న కార్యాచరణతో ముందుకువెళ్తున్నారు. ఈ క్రమంలో రివర్‌ఫ్రంట్ ఏరియా లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం ప్రాంతాలలో అంతకుముందు అనుకున్న విధంగా స్టార్టప్ ఏరియా అభివృద్ధి చేసే ప్రణాళికకు కూటమి ప్రభుత్వం మళ్లీ జీవం పోస్తుంది. ఇందుకోసం గత నాలుగు మాసాలుగా సింగపూర్ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరుపుతుంది. అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతూ సింగపూర్ బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమరావతికి ఆహ్వానించింది. దీంతో ఆ బృందం బుధవారం రాజధాని ప్రాంతంలో పర్యటించింది. తాజాగా గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయింది. రాజధాని అమరావతి నిర్మాణ పనులకు సమాంతరంగా ఓఆర్‌ఆర్.. తాజాగా స్టార్టప్ ఏరియా అభివృద్ధి కూడా జరగాలని ముఖ్యమంత్రి పథక రచన చేశారు. ఇందుకోసం సింగపూర్ కన్సార్షియంను మళ్లీ తెరమీదకు తీసుకువచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుంది. వాస్తవానికి సింగపూర్ కన్సార్షియంతో రాష్ట్రప్రభుత్వ ఒప్పందాలను గత వైసీపీ ప్రభుత్వం అవమానకరంగా రద్దు చేయించింది. అయినా చంద్రబాబు మళ్లీ వారితో సంప్రదింపులు చేసి మరోమారు పాత ఒప్పందాలను పునరుద్ధరించుకునే దిశగా ఆ బృందాన్ని ఒప్పించగలిగారు.

మూడు దశల్లో అభివృద్ధికి ప్రణాళిక

గతంలో స్విస్ ఛాలెంజ్ విధానంలో సుమారు 1691 ఎకరాలను పెట్టుబడులకు, వర్తక, వాణిజ్య సంస్థలకు కేంద్రంగా స్టార్టప్ ఏరియాను మూడు దశలుగా అభివృద్ధి చేయాలని ఓ యాక్షన్ ప్లాన్‌ను తయారుచేశారు. ఇందుకోసం కొన్ని ఒప్పందాలతో సింగపూర్ కన్సార్షియం ఏడీసీఎల్ కలిసి అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్ ప్రైవేటు లిమిటెడ్‌గా ఏర్పడి మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేయాలని భావించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్‌ను గతంలో మాదిరి యథారీతిన అనుసరిస్తారా! లేక ఏవైనా మార్పుచేర్పులతో సరికొత్త ప్రణాళికలను రూపొందించుకుని తదనుగుణంగా ముందుకు వెడతారా అన్నది మరికొద్ది రోజులో తేలనున్నది. గత ప్రణాళిక ప్రకారమైతే తొలిదశలో 656 ఎకరాలు, రెండోదశలో 514 ఎకరాలు, మూడో దశలో 521 ఎకరాలను అభివృద్ధి చేయాలని భావించారు. అప్పట్లో ఈ ప్రాజెక్టు పెట్టుబడిని రూ.3137 కోట్లుగా అంచనా వేశారు. గత కాలపు ఒప్పందం ప్రకారం తొలిదశలో ఎనిమిది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం వచ్చేలా ఓ మెగా టవర్‌ను నిర్మించాలి. ఇంకో నాలుగువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వెల్‌కమ్ గ్యాలరీని నిర్మించాలి. రెండో దశలో ఇదే తరహా టవర్‌ను నిర్మించాలి. వీటిల్లో వచ్చే ఆఫీస్ స్పేస్‌ను లీజులకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రప్రభుత్వానికి 48 శాతం, సింగపూర్ కన్సార్షియం 52 శాతం వంతున పంచుకోవాలి. అలాగే మిగతా అభివృద్ధి చేసిన భూముల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో ప్రభుత్వానికి 75శాతం, సింగపూర్ కన్సార్షియంకు 25శాతం వంతున వచ్చేలా అప్పట్లో ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా ఈ నిబంధనలన్నీ మళ్లీ మారే అవకాశాలు ఉన్నాయి. భూమిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం వల్ల జాతీయ, అంతర్జాతీయ, వాణిజ్య, ఆర్థిక సంస్థలను ఇక్కడికి రప్పించి అమరావతి స్టార్టప్ ఏరియాను ఆర్థిక లావాదేవీలకు ఓ ప్రధాన కేంద్రంగా చేయాలన్నది కూడా ఓ లక్ష్యంగా ఉంది. దీనివల్ల ఆదాయం గణనీయంగా పెరగడంతోపాటు యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. భూములకు కూడా ప్రభుత్వం ఆశించిన విధంగా మంచి ధరలు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఈ భూములను విక్రయించే బాధ్యత కూడా స్టార్టప్ ఏరియా డెవలపర్‌కే అప్పగించారు.

అమరావతికి.. 21 తర్వాత మోదీ

- రూ.లక్ష కోట్ల పనులకు ప్రధాని శ్రీకారం
- వెలగపూడిలో 250 ఎకరాల్లో సభా ప్రాంగణం
- 'ఆంధ్రజ్యోతి'తో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి


నాగలక్ష్మి, కలెక్టర్



గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఈ నెల 21 తర్వాత ఏరోజైనా ఉండొచ్చు. ఇందుకోసం ముందస్తుగా అన్ని సిద్ధం చేసి పెట్టుకుంటున్నాం..' అని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి గురువారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్‌డీఏ, ఇతర సంస్థలకు సంబంధించి రూ.40 వేల కోట్లకు పైగా విలువ చేసే పనుల టెండర్లు పూర్తి అయి గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలానే ప్రైవేటు విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, కళాశాలలకు సంబంధించి మరో రూ.60 వేల కోట్లకుపైగా ఉన్నాయన్నారు. మొత్తం కలిపి రూ.లక్ష కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీతో చేతుల మీదగా అంకురార్పణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరి, సీఎంవో నుంచి అందిన ఆదేశాలతో తాము ప్రధాని పర్యటన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. వెలగపూడి సచివాలయం పక్కన ఉగాది నాడు జరిగిన పీ4 ప్రారంభోత్సవ వేదిక వద్దనే ప్రధానమంత్రి పర్యటన ఉంటుందని తెలిపారు. ఆ ప్రాంతంలోనే దాదాపుగా 250 ఎకరాల్లో ప్రధాని సభా ప్రాంగణం ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. మోదీచే ప్రారంభమయ్యే పనులన్నీ రెండు, మూడేళ్లలోనే పూర్తి అయ్యేలా కార్యాచరణ ప్రణాళికని కూడా రూపొందించడం జరిగిందన్నారు.


వెల్దుర్తి మండలం మండాదిలో మిర్చి కల్లంలో ఉన్న నీటిని బయటకు తోడుతున్న రైతు

8

పల్నాడులో.. అకాల వర్షం

- రైతులు ఉరుకులు, పరుగులు
- లబోదిబోమంటున్న మిర్చి రైతులు

11 బీఈడీ కళాశాలలకు నోటీసులు

పలు ఆరోపణల నేపథ్యంలో స్పందించిన ఎన్సీటీఈ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని 11 బీఈడీ కళాశాలలకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్సీటీఈ) నోటీసులు జారీ చేసింది. పనితీరు అంచనా నివేదికకు సంబంధించి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. వర్సిటీ పరిధిలోని గుంటూరు, నరసరావుపేట, రేపల్లె ప్రాంతాల్లోని కళాశాలలకు ఈ నోటీసులు జారీ అయ్యాయి. కొందరు అధికారుల తీరుతో వర్సిటీ పరిధిలో బీఈడీ కోర్సు నిర్వీర్యం అవుతోందనే ఆరోపణలున్నాయి. మార్చిలో బీఈడీ ప్రశ్నపత్రం లీకైన విషయం తెలిసిందే. బీఈడీ ప్రయోగ పరీక్షల తనిఖీ బృందాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇటువంటి వారికి ప్రయోగ పరీక్షల్లో కీలక బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వచ్చాయి. ఒక విడత పరీక్షల్లో ఎగ్జామినర్‌గా, తనిఖీ బృందాల్లో కీలక సభ్యులుగా ద్విపాత్రాభినయంపైనా విమర్శలు వస్తున్నాయి. కొన్ని బీఈడీ కళాశాలలు ఒక్కో విద్యార్థి నుంచి రూ.10,000 పైగా వసూలు చేసి పరీక్షలను పక్కదారి పట్టిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇలా బీఈడీ కళాశాల నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో ఎన్సీటీఈ నోటీసులు జారీ చేయడం గమనార్హం.



- పల్నాడు, బాపట్ల జిల్లాలు ఆవిర్భవించి నేటికి మూడేళ్లు
- ఇంకా అద్దె భవనాల్లోనే పలు కార్యాలయాలు
- పట్టాలెక్కని సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం
- సిబ్బంది కొరత.. వసతుల లేమి సరేసరి
- జిల్లా అధికారుల నియామకాలు లేవు.. ఇన్‌చార్జిలే దిక్కు


శిథిల భవనంలో జిల్లా సరఫరా అధికారి కార్యాలయం

మూడేళ్లయినా.. తప్పటడుగులే



కలెక్టరేట్


ఎస్పీ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి.. పాలన ప్రక్షాళన.. ప్రభుత్వ సేవలు ప్రజల దరికి చేర్చాలని.. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల విభజన చేపట్టింది. అయితే ఆయా లక్ష్యాల మాటేమో కానీ జిల్లాల విభజనలోని చిక్కుముడులు ఇంకా కొనసాగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాను లోక్‌సభ నియోజకవర్గాల ప్రాతిపదికగా పల్నాడు, బాపట్ల జిల్లాల విభజన జరిగింది. శుక్రవారంతో జిల్లాల విభజన జరిగి మూడేళ్లు అవుతుంది. అయినా ఇంకా పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడంలేదు. 2022 ఏప్రిల్ 4న జిల్లాల విభజన జరగ్గా ఇంకా తప్పటడుగులతోనే పాలన సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా.. హడావుడిగా జిల్లా ఏర్పాటుతో సరిపెట్టింది. దీంతో ఇప్పటికీ ఉద్యోగుల విభజన మొదలు కార్యాలయాల ఏర్పాటు వరకు అన్నింటా అస్పష్టతే రాజ్యమేలింది. జిల్లా ఏర్పడిన ఆరు నెలల్లోపే సమీకృత కలెక్టరేట్ నిర్మిస్తామని, నిష్పత్తి ప్రకారం అన్ని విభాగాల్లో సిబ్బందిని నియమిస్తామని, ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని.. ఆర్భాటంగా ప్రకటించిన అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఆ తర్వాత ఆ ఊసే మరిచారు. గత ప్రభుత్వం చెప్పిన మాటలు ఏ ఒక్కటీ అమలుకాకపోగా అటు ఉద్యోగులు, ఇటు ప్రజల గోడు వినే నాధుడే కరువయ్యారు. ఇక జిల్లాల స్థాయిలో ప్రగతి పనులు అమలు కూడా వెనుకబాటు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అభివృద్ధిలో కొత్త జిల్లాల్లో పల్నాడు జిల్లా వెనకబడి ఉన్నట్లు ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి.

గాడిన పడని పాలన..

మూడేళ్లు అయినా అటు పల్నాడులో కానీ ఇటు బాపట్లలో కానీ పాలన ఇంకా గాడిలో పడలేదు. జిల్లా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడం లేదు. జిల్లా కార్యాలయాల్లో కనీస వసతులు లేక ఉద్యోగులు.. ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న కార్యాలయాలకు (మిగతా 8వ పేజీలో)

సమస్యలు ఇలా..

- పోలీసు శాఖకు సరైన వసతులు లేవు. కనీసం ఆయుధాలు భద్రపరిచే వసతి కూడా లేదు. దీంతో గుంటూరులోనే ఆయుధాలు ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.జిల్లాలో ఎక్కడైనా పెద్ద సంఘటన జరిగితే జిల్లా కేంద్రం నుంచి బలగాలను పంపించే సౌకర్యం లేక పోలీసు అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రాత్రి వేళ జిల్లా కేంద్రంలో పోలీసులు బస చేసే అవకాశం లేదు. ఎస్పీ, ఏఎస్పీ కార్యాలయాలు మినహా ఇతర విభాగాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు.
- కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న జేసీ, డీఆర్వో, సర్వే, సీపీవో కార్యాలయాలకు పూర్తి స్థాయిలో వసతులు లేవు.
- వ్యవసాయ శాఖ కార్యాలయాలను ఆర్‌బీకె, సచివాలయం, విలేజ్ క్లినిక్ భవనాల్లో ఏర్పాటు చేశారు. దీంతో క్లినిక్‌లో రోగులకు వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.
- డీపీవో కార్యాలయాన్ని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నారు.
- నరసరావుపేటలో భవనాల కొరతతో కొన్ని కార్యాలయాలు ఇంకా గుంటూరు నుంచే నిర్వహిస్తున్నారు.
- ఇంజనీరింగ్‌కు సంబంధించిన శాఖల్లో ఈఈ స్థాయి అధికారే సీఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఏపీడీలే పీడీలుగా ఉన్నారు. డీఎల్‌పీవోనే డీపీవోగా విధులు నిర్వహిస్తున్నారు.

రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు

15 గ్రామాల్లోని 197 మందికి 494 ప్లాట్లు కేటాయింపు 6

పశువుల బీమా ప్రీమియం తగ్గింపు

15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం

8

అరచేతిలో.. పుర సేవలు

- అందుబాటులోకి పురమిత్ర యాప్
- సులభంగా ప్రజల సమస్యలు పరిష్కారం

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా

అభ్యంతరాలకు 11వ తేదీ వరకు అవకాశం 6

రెండు కుటుంబాల మధ్య వివాదం

- కర్రలతో దాడి.. అక్కడికక్కడే వృద్ధురాలి మృతి
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిపైనా దాడి

తురకా కిశోర్‌పై పీడీ యాక్ట్



- గత ఐదేళ్లు రాజ్యాంగేతరశక్తి రెచ్చిపోయాడు
- పిన్నెల్లి సోదరుల అండతో మాచర్లలో దందాలు

6

రేపల్లె-నిజాంపట్నం రోడ్డుకు మహర్దశ


మంత్రి అనగాని

రేపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రేపల్లె-నిజాంపట్నం రహదారి అభివృద్ధికి రూ.9 కోట్ల 75 లక్షలు నిధులు మంజూరు చేయించామని రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గతప్రభుత్వ హయాంలో ఈ రహదారికి కనీసం మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. దశాబ్దకాలంగా ఈరహదారిని అభివృద్ధిచేసిన దాఖలాలు లేవని కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్దినెలలకే రహదారిని అభివృద్ధిచేసేందుకు నిధులు మంజూరుచెయ్యటం జరిగిందన్నారు. రేపల్లెనుంచి నిజాంపట్నం పూర్తిస్థాయిలో బీటీరోడ్డు నూతనంగా అభివృద్ధిచెయ్యన్ననట్లు తెలిపారు. పల్లపట్ల గ్రామంలో కిలోమీటర్‌మీరా పదిమీటర్ల వెడల్పుతో సీసీరహదారిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనిధుల మంజూరుకోసం రహదారి అభివృద్ధి చెయ్యటంలో కొంత జాప్యం జరిగిందని తెలిపారు. ఈరహదారి పనులను వారంరోజుల్లో ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

పశువుల బీమా ప్రీమియం భారీగా తగ్గింపు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో ఉన్న పాడి పశువుల యజమానులకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. పశువుల బీమా ప్రీమియాన్ని తగ్గిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు 20 శాతం వరకు రైతు వాటాగా చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ఈ ఏడాది 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉదాహరణకు ఒక పాడి గేదె/ఆవు విలువ రూ. 30 వేలు గా ఉంటే, మూడు సంవత్సరాలకు ప్రీమియం కింద రూ.1920 చెల్లించాల్సి వచ్చేది. తాజా ఉత్తర్వులు ప్రకారం రైతులు కేవలం రూ.288 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఒక గొర్రె/మేక /పంది విలువ రూ.6 వేల వరకు ఉండగా, రైతు వాటాగా మూడు సంవత్సరాలకు గాను కేవలం రూ. 56 చెల్లిస్తే సరిపోతుంది. గతంలో కేవలం ఒక్కో రైతు ఐదు పాడి పశువులకు మాత్రమే బీమా చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం పది పాడి పశువుల వరకు బీమా చేసుకునే వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా కేవలం 50 గొర్రెలు, మేకలకు మాత్రమే భీమా చేసుకునే అవకాశం ఉండగా, ప్రస్తుతం ఒక్కో రైతు 100 గొర్రెలు, మేకలకు భీమా చేయించే అవకాశం కల్పించారు. ఈ పశు భీమా పథకం ద్వారా పశువు ప్రమాదం వలన గాని, వ్యాధుల వలన గాని, ప్రకృతి వైపరీత్యాల వలన గాని మరణిస్తే యజమానులకు నష్ట పరిహారం అందుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు తెలిపారు. పశువుల యజమానులు నిర్లక్ష్యం వహించకుండా భీమా చేయించుకోవాలని సూచించారు.

లారీ ఢీకొని మహిళ మృతి


వుయ్యూరు వెంకటరత్నం

పెదకాకాని, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నిలబడి ఉన్న మహిళను లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.... నంబూరు గ్రామానికి చెందిన వుయ్యూరు వెంకటరత్నం(52) అనే మహిళ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో గ్రామం మెయిన్ రోడ్‌లోని శివాలయం సమీపంలో గోళ్ళమూడి నుంచి ఈమని గ్రామానికి వెళ్తున్న లారీ అదుపుతప్పి మహిళలను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటరత్నానికి తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ కొద్దీసేపటికి మృతి చెందింది. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉండటంతో మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం పెదకాకానిలోని అపరకర్మల సత్రం వద్ద ఉంచారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

197 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు


రైతులకు ప్రొవిజనల్ సర్టిఫికేట్లు అందజేస్తున్న సీఆర్డీఏ అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన 15 గ్రామాలకు చెందిన 197 మంది రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్లాట్లు కేటాయించారు. విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో గురువారం ఈ- లాటరీ విధానం ద్వారా రైతులకు 494 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వాటిలో 297 నివాస ప్లాట్లు కాగా, 197 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నవులూరు, కురగల్లు, నిడమర్రు, పెనుమాక, నెక్కల్లు, అనంతవరం గ్రామ రైతులకు ఈ- లాటరీ నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాయపూడి, వెంకటపాలెం, వెలగపూడి, మందడం, దొండపాడు, పిచ్చుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, ఉద్ధండరాయునిపాలెం గ్రామ రైతులకు ఈ- లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ విధానం ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఈ- లాటరీకి హాజరైన రైతుల సౌకర్యార్థం సీఆర్డీఏ అధికారులు తొలుత ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్ల ఎంపికకు సంబంధించి ట్రైల్ రన్ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం లాటరీ ప్రక్రియను నిర్వహించి ప్లాట్లను కేటాయించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు మాట్లాడుతూ.. ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించారో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామని చెప్పారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుమూ వసూలు చేయబోమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జీ. భీమారావు, ఎం.శేషి రెడ్డి, జీ. రవీందర్, ఏ.జీ. చిన్నికృష్ణ, పీ. పద్మావతి, జీ.రవీందర్, కే. స్వర్ణమేరీ, బీ. సాయి శ్రీనివాస నాయక్, కే. ఎస్. భాగ్యరేఖ, సీఆర్డీఏ ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్. నాగేశ్వరరావు, సీఆర్డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

పౌర్ణమికి అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గుంటూరు, ఏప్రిల్ 3: ఈనెల 12న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి 10న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 11వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 12న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజున అరుణచలేశ్వరుని దర్శించుకొని సాయంత్రం బయల్దేరి 13వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జీ రూ. 2,420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459, 7382896403 సంప్రదించాలని కోరారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా

గుంటూరు (విద్య) ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జడ్పీ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి కల్పిస్తున్నట్లు డీఈఓ రేణుక గురువారం తెలిపారు. పదోన్నతులకు అర్హులైన వారి జాబితాను డీఈఓ జిఎస్‌టి బ్లాగుస్పాట్ అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఈ నెల 11 లోగా తెలియజేయాలని సూచించారు.


ప్రథమ స్థానం సాధించిన మద్దిరాల ముప్పాళ్ల ఎడ్ల జత

సబ్ జూనియర్ విభాగంలో..

మద్దిరాల ముప్పాళ్ల ఎడ్లజతకు ప్రథమ స్థానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో సబ్ జూనియర్ విభాగంలో నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన రైతు పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న బల ప్రదర్శనలో గురువారం జరిగిన పోటీలో ఈ ఎడ్లు 4200 అడుగుల దూరం బండ లాగాయి. మంతెనవారిపాలెంకు చెందిన రైతు మేకా ప్రతీక్ ఎడ్ల జత 3900 అడుగుల బండ లాగి ద్వితీయ స్థానం, పెనమలూరు మండలం పెదపులిపాక రైతు గరికపాటి శ్రీధర్ ఎడ్ల జత 3311 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ నాయకులు పోటీలను పర్యవేక్షించారు.


మాట్లాడుతున్న ఆచార్య ఆసిం బికాస్ దాస్

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎన్ఐటీ ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్

గుంటూరు (విద్య) ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధా(ఏఐ), నెట్‌వర్క్ బయోలజీ ప్రెసిషన్ థెరపీలు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎన్ఐటీ వరంగల్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగంలోని సీఎస్ఈ, ఏసీఎస్ఈల సంయుక్త ఆధ్వర్యంలో రీసెంట్ కంప్యూటింగ్ ట్రెండ్స్ ఫర్ బయో ఇన్ఫర్మేటిక్స్ అండ్ బయోటెక్నాలజీ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ మాట్లాడుతూ క్యాన్సర్ అనేది ప్రపంచవ్యాప్తంగా పెద్ద సవాలుగా మిగిలిపోయిన ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్య అని, ఈ రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), నెట్‌వర్క్ బయోలజీ వంటి ఆధునిక సాంకేతికతలు క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ రెండూ సమగ్ర, వ్యక్తిగతీకరించిన (పర్సనలైజ్డ్) ప్రెసిషన్ థెరపీ రూపంలో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా మార్చుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుదుచ్చేరిలోని ఐసీఎంఆర్ వెక్టర్ కంట్రోల్ రీసెర్చ్ సెంటర్ సైంటిస్ట్ డాక్టర్ నంద కుమార్ యెల్లపు, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

7 నుంచి ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేత

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం వైద్య సేవలను ఏప్రిల్ ఏడవ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.3500 కోట్లు నిలిచిపోవడంతో ఆర్థిక భారం మోయలేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. గత ఏడాది ఏప్రిల్‌లో చేసిన వైద్య సేవలకు సైతం ఇప్పటి వరకు పూర్తి చెల్లింపులు జరగలేదన్నారు. పలుసార్లు ప్రభుత్వానికి తమ ఇబ్బందులు వివరించి బకాయిలు తీర్చమని కోరామని, ఇకపై గత్యంతరం లేని పరిస్థితుల్లో ఏప్రిల్ ఏడవ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద సేవలు నిలిపివేయాలని ఆషా నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు.

DISTRICT DIET MANAGEMENT COMMITTEE, GUNTUR DISTRICT
OFFICE OF THE SUPERINTENDENT, GOVT. GENERAL HOSPITAL GUNTUR.
Rc.No.811/Diet-HDS/2025 Dt.03.04.2025

TENDER NOTIFICATION

Sealed Tenders are invited for supply of Diet to the Inpatients and Duty Doctors in Government General Hospital, Guntur for initial period of 2 (two) years and extendable for further one year, if the District Diet Management Committee, is satisfied with the service of the Contractor. For Terms & Conditions and Tender Schedule for supply of Diet application has to be obtained on payment of fees of Rs.10,000/- by way of DD in favor of "Hospital Development Society, GGH, Guntur" from any nationalized bank.

Sale of Tender Forms : From 04.04.2025 to 16.04.2025 during office hours
Last date for receipt of Sealed Tenders : 17.04.2025 up to 02:00 PM
Opening of Tender : 17.04.2025 at 04:00 PM in the chambers of the Joint Collector / Chairman, DDMC, Guntur District.

Sd/-Dr. S.S.V.Ramana, SUPERINTENDENT, Member Convener, DDMC.
Sd/- A.Bhargav Teja, IAS Joint Collector/Chairman, DDMC.

ది గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్
రిజిస్టర్ నెం. ఐ-908
మెడికల్ కాలేజి రోడ్డు, కన్నావారితోట, గుంటూరు.
టెండర్ నోటీసు నెం. 01/2025-2026 తేది: 03-04-2025

షార్ట్ టెండర్ ప్రకటన

ది గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, గుంటూరు నకు నరసరావుపేట మునిసిపల్ పరిధిలో గల స్థలము నందు ఈ దిగువ తెలిపిన పనులు చేపట్టుటకు అర్హత కలిగి వుండి ఆసక్తి గల కాంట్రాక్టర్ల నుండి షార్ట్ టెండర్లు కోరడమైనది.

వ. సంఖ్య	చేయవలసిన పని వివరములు	అంచనా విలువ (రూ.లలో)
1	గోదామునకు నాలుగు వైపుల CC రోడ్డులు వేయుటకు, వర్షపు నీటి కాలువలు నిర్మించుటకు	1,08,00,000/-
2.	షాపులు / స్టోర్ రూమ్స్‌లకు ముందు మరియు వెనుక భాగము స్టోన్ డస్ట్‌తో నింపి సిమెంట్ కాంక్రీట్ ఫ్లోరింగ్ బెడ్ వేయుటకు షాపులు, మెయిన్ గేటు ముందు భాగమున గల కాలువలో సిమెంట్ పైపులు వేసి సిమెంట్ కాంక్రీట్‌తో రోడ్డులు వేయుటకు	20,65,000/-

పైన ఉదహరించిన నిర్మాణ పనుల నిమిత్తమై ప్రతి ఒక్క పనికి టెండరు షెడ్యూలు విడివిడిగా పొందుటకు రూ.5000/- విలువ గలిగిన డి.డి.లను జాతీయ బ్యాంకుల నుండి ది గుంటూరు జిల్లా కో- ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ గుంటూరు వారి పేర తీసి సంబంధిత షెడ్యూళ్ళను ది. 04-4-2025 ఉదయం గం. 10.30 ని.ల నుండి ది 10-04-2025 సాయంత్రం గం 3.00 ల వరకు ఆఫీసు పని దినములలో పొందగలరు. సీల్డు టెండర్లు ది 10-04-2025 సాయంత్రం గం. 4.00ల వరకు ప్రధాన కార్యాలయము, గుంటూరు నందు స్వీకరించబడును. సదరు సీల్డు టెండర్లు ది. 10-04-2025 గురువారం సాయంత్రం గం. 4.30 ని లకు హాజరైన టెండరు దారుల సమక్షములో తెరువబడును.

వివరముల కొరకు : సెల్ నెం. 9849924429, నెం: 9989522621
తేది : 03-04-2025 సం/- D. హరిగోపాలం, బిజినెస్ మేనేజర్

తెనాలి - గుంటూరు రైలుమార్గం పొడవునా స్టీల్ ఫెన్సింగ్

● 20.19 కిలోమీటర్ల పొడవునా ఇరువైపులా నిర్మాణం ● రూ. 13.7 కోట్లు మంజూరు చేసిన రైల్వేబోర్డు


యాంట్రీ క్రాష్ బ్యారియర్(నమూన)

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు జాతీయ రహదారులకు ఇరువైపులా నిర్మాణానికి పరిమితమైన యాంట్రీ-క్రాష్ బ్యారియర్/ డబ్ల్యూ-బీఎం స్టీల్ ఫెన్సింగ్‌ని రైల్వేట్రాక్‌ల వెంట కూడా ఏర్పాటు చేసేందుకు రైల్వేబోర్డు ఉపక్రమించింది. ఇందులో భాగంగా తెనాలి - గుంటూరు సెక్షన్‌లో తొలుత ఈ పనిని చేపట్టాలని నిర్ణయించింది. దీంతో గుంటూరు డివిజనల్ రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారులు టెండర్లు పిలిచారు. సాధ్యమైనంత త్వరగా ఏజెన్సీని ఖరారు చేసి ఏడాది వ్యవధిలోనే ఈ పనిని పూర్తి చేయాలని భావిస్తున్నారు. దీని వలన రైల్వేట్రాక్‌ల పైకి ట్రెస్‌పాస్‌లు, పశువులు రావడం వంటి చర్యలకు ఫుల్‌స్టాప్ పడి రైళ్ల రాకపోకలకు మరింత భద్రత ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో తెనాలి - గుంటూరు డబ్లింగ్ సెక్షన్ ఎంతో కీలకమైనది. పచ్చటి పొలాల మధ్య నుంచి ఈ రైలుమార్గం వేజండ్ల, సంగం జాగర్లమూడి, అంగలకుదురు మీదగా ఏర్పాటై ఉన్నది. అయితే ఇటీవలకాలంలో తరచుగా పశువులు హఠాత్తుగా ట్రాక్ పైకి వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా సందర్భాలలో లోకో(ఇంజిన్)లో పశువుల కళేబరాలు ఇరుక్కుపోయి మరమ్మతులకు గురౌతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారులపై ట్రెస్‌పాసింగ్ జరగకుండా ఎలాగైతే యాంటీ-క్రాష్ బ్యారియర్/ డబ్ల్యూ-బీమ్ స్టీల్ ఫెన్సింగ్‌ని ఏర్పాటు చేస్తున్నారో అదే రీతిన రైలుమార్గాల పొడవునా ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. గుంటూరు - తెనాలి మధ్యన 20.19 కిలోమీటర్ల పొడవు రైలు మార్గం ఉన్నది. ఇరువైపులా కలుపుకొంటే 40.38 కిలోమీటర్ల పొడవునా ఈ యాంట్రీ-క్రాష్‌బ్యారియర్ నిర్మించాల్సి వస్తుంది. ఇందుకోసం రెండు టెండర్లను రైల్వే శాఖ ఆహ్వానించింది. ఒక్కో టెండరు విలువ రూ. 6 కోట్ల 88 లక్షల 48 వేల 385గా పేర్కొన్నది. రెండు నెలల్లో ఏజెన్సీలను ఖరారు చేసి ఏడాది వ్యవధిలో పనిని పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకొన్నది.

తురకా కిశోర్‌పై పీడీ యాక్ట్

- పలు కేసుల్లో ఇప్పటికే రిమాండ్

గుంటూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పలు కేసులకు సంబంధించి నెల్లూరు జైలులో మూడు నెలలుగా రిమాండ్ ఖైదీగా ఉన్న మాచర్ల మున్సిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిశోర్‌పై గురువారం పీడీ యాక్ట్ నమోదయ్యింది. ఈ నేపథ్యంలో నెల్లూరు జైలు నుంచి రాజమహేంద్రవరానికి తరలిస్తున్నట్లు పట్టణ సీఐ ప్రభాకర్ రావు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుని అండతో మాచర్ల ప్రాంతంలో రాజ్యాంగేతర శక్తిగా కిశోర్ రెచ్చిపోయాడు. మొదటి నుంచి పిన్నెల్లికి ప్రధాన అనుచరుడిగా ఉంటూ ఆయన అండదండలతో మాచర్లలో దాదాగిరి చేసేవాడు. తర్వాత వైసీపీ మాచర్ల పట్టణ యూత్ అధ్యక్షుడిగా నియమితులయ్యాడు. రౌడీయిజం చేస్తూ బెదిరింపులు, దందాలకు తెగబడ్డాడు. పంచాయితీలు చేస్తూ పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడ్డాడు. టీడీపీ కార్యకర్తలనే కాదు సామాన్యులను సైతం భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ క్రమంలో పంచాయితీల వాటా పంపకాల్లో తేడాలు రావడంతో అప్పటి వైసీపీ నేత, తన సామాజిక వర్గానికి చెందిన చిన అంజిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే మొదటి నుంచి చిన అంజి, ఆయన అన్న పెద అంజి టీడీపీలో ఉండేవారు. మధ్యలో చిన అంజి వైసీపీలోకి వెళ్లినప్పటికీ కిశోర్ దాడితో తిరిగి టీడీపీలో చేరాడు. ఈ కక్షతో ఆయన సోదరుడు పెద అంజిపై పీడీ యాక్ట్ బనాయించి ఆరు నెలలు జైలుకు పంపాడు. పిన్నెల్లి సోదరుల అండతో పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తగులబెట్టడం, ప్రస్తుత ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో దాడికి పాల్పడటం, బుద్దా వెంకన్న, బోండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది పారా కిశోర్‌పై దాడి, హత్యాయత్నం, ఎన్నికల సమయంలో దాడులు ఇలా అనేక కేసుల్లో నిందితుడిగా తురకా కిశోర్ ఉన్నాడు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో బోండా ఉమా, బుద్దా వెంకన్నలపై హత్యాయత్నం చేసినందుకు కిశోర్‌కు మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పదవిని పిన్నెల్లి గిఫ్ట్‌గా ఇచ్చారు. ఈ పదవిని అడ్డంపెట్టుకుని రెండేళ్లకు పైగా కిశోర్ మాచర్లలో మరింతగా రెచ్చిపోయాడు. ఈ నేపథ్యంలో అతడిపై పలు హత్యాయత్నాలు, భూకబ్జాలు, దాడులకు సంబంధించి 8 కేసులు నమోదయ్యాయి. అతడు చేసిన దందాలన్నింటిపై కేసులు నమోదైతే కనీసం 100కు పైగా కేసుల్లో నిందితుడిగా ఉండేవాడని పోలీసులు సైతం చెబుతుండటం గమనార్హం.

వృద్ధురాలిపై కర్రలతో దాడి, అక్కడికక్కడే మృతి


షేక్ ఖాజాబీ

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆనందపేటలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వృద్ధురాలు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం వెలుగు చూసింది. పాత గుంటూరు పోలీసుల కథనం ప్రకారం...... ఆనందపేటకు చెందిన షేక్ ఫిరోజ్, ఫరోజ్ అనే ఇరువురు అన్నతమ్ముళ్లు. వీరికి అదే ప్రాంతానికి చెందిన ఆసిఫ్, సన్నీ అని ఇద్దరు స్నేహితులు ఉన్నారు. అయితే తమ చెల్లెలు గురించి అదే ప్రాంతానికి చెందిన హర్షత్ అనే యువకుడు అసభ్యంగా మాట్లాడటం జరుగుతుంది. దీంతో హర్షత్ ఇంటి మీదకుపై నలుగురు గొడవకు వెళ్లారు. హర్షత్‌తో గొడవ పడుతుండగా అడ్డొచ్చిన అతని తల్లి షాజహాన్, తండ్రి బాబును కొట్టారు. తీవ్రంగా గాయపడిని వారిని వైద్య చికిత్స నిమిత్తం జిజిహెచ్‌కి తరలించారు. మా ఇంటిపై దాడికి వచ్చారా అంటూ హర్షత్ అమ్మమ్మ షేక్ ఖజాబీ (70) ప్రశ్నించింది. దీంతో మరింతగా రెచ్చిపోయిన ఫిరోజ్, ఫరోజ్, ఆసిఫ్, సన్నీలు ఆమెపై కర్రలతో విచక్షణరహితంగా దాడి చేసి కొట్టారు. దీంతో ఆమె రోడ్డుపై పడి మృతి చెందింది. అంతటితో ఆగకుండా అక్కడ నుంచి గుంటూరు జి జి హెచ్ కి వెళ్లిన నలుగురు నిందితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబు, షాజహాన్‌లను కూడా తీవ్రంగా కొట్టారు. ఖజాబీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా ఈ రెండు ఘటనలపై కేసులు చేశారు. ఈ కేసులో ప్రధాని నిందితులైన నలుగురు పరారీలో ఉన్నట్లు పాత గుంటూరు పోలీసులు తెలిపారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
DISTRICT LEVEL SAND COMMITTEE
COLLECTORATE; GUNTUR

SHORT NOTICE INVITING BIDS

Short Notice inviting Bids for selection of Agency for Excavation of Sand at Sand Reaches and Loading of Sand at the designated Stock points in Guntur District, Andhra Pradesh

Bid Notice No.1353/Sand/2024 **Dt: 04.04.2025**

THE DISTRICT LEVEL SAND COMMITTEE, GUNTUR invites Bids from interested Agencies/Individuals for Excavation of Sand at the following Sand Reaches and Loading of Sand at their designated Stock points in Guntur District, Andhra Pradesh:

Sl No	Name of the Reach	Area in Hects.	Latitude	Longitude	Quantity	EC Validity
1	Gundimeda Sand Reach, Gundimeda (V), Tadepalli Mandal, Guntur District	4,930	16°27'24.60"N	80°39'40.20"E	34,505 Cbm (51,758 MTs)	26.03.2026
			16°27'29.09"N	80°39'41.98"E		
			16°27'23.38"N	80°39'50.59"E		
			16°27'25.26"N	80°39'50.08"E		
			16°27'27.83"N	80°39'46.43"E		
			16°27'29.46"N	80°39'41.98"E		
			16 27 29.05"N	80°39'34.56"E		
			16°27'29.89"N	80°39'31.59"E		
			16°27'29.17"N	80°39'31.29"E		
			16°27'26.34"N	80°39'33.15"E		
			16°27'23.61"N	80°39'35.55"E		
			16°27'23.91"N	80°39'39.69"E		

Note: 1. Bid document along with the information on the eligibility criteria, ECV, EMD, PSD, Timelines etc., can be obtained from O/o. District Mines & Geology Officer, H.No.5-76-22, 4/2, Pandaripuram, Guntur-2 on payment of Rs.10,000/- (Rupees Ten Thousand only) towards Bid document fee in the shape of Demand Draft drawn from any Indian Nationalized Bank in favour of the Chairman, DLSC, Guntur payable at Guntur.
2. The sale of Bid document from 07-04-2025 to 09-04-2025.
3. Last date for submission of bid is 10-04-2025 by 3.00 PM.
4. Announcement of Successful Bidder on 11.04.2025.

Place: Guntur
Date: 04-04-2025

Sd/- S. Nagalakshmi, I.A.S.
District Collector and Chairperson, DLSC, Guntur.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పైపులైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీదేవి

నకరికల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వరకు బీపీసీఎల్ నిర్మిస్తున్న పైపులైన్ నిర్మాణానికి రైతులంతా సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీదేవి కోరారు. గురువారం నకరికల్లు తహసీల్దార్ కార్యాలయంలో పైపులైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు కింద మొత్తం 105 గ్రామాల్లో 308 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. రైతుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. చల్లగుండ్ల, నకరికల్లు, నరసింగపాడు గ్రామాల్లోని భూములు కోల్పోయిన రైతులకు సెంటుకు రూ.12వేలు పరిహారం ఇచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కాగా పరిహారం పెంచాలని రైతులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కే పుల్లారావు, బీపీసీఎల్ ప్రాజెక్టు హెడ్ భగవాన్ శుక్లా, సైట్ అధికారి అమిత్ కాంబ్లీ, సైట్ ఇన్‌చార్జ్ పవన్, బీపీసీఎల్ సర్వేయర్లు, అయా గ్రామాల వీఆర్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి

పారదర్శకంగా జీవనోపాధి ప్రణాళికలు

● ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి

మాచవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు సంబంధించి వార్షిక అప్పులు, జీవనోపాధి ప్రణాళికలు వీవోఏలు పారదర్శకంగా రూపొందించాలని ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి ఆదేశించారు. గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలపై వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిని, డీపీఎం హనుమానాయక్, ఎస్‌పీవో శివకుమార్, సీసీలు సీతారామయ్య, నాగరాజు, రామారావు, ఆచారి పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పారాలీగల్ వలంటీర్లు బాధ్యతతో పనిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి విజయకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం పారా లీగల్ వలంటీర్లకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పారాలీగల్ వలంటీర్లు బాధ్యతాయుత విధులు కలిగి ఉన్నారన్నారు. ప్రజల ముంగిట న్యాయం అనే నినాదంతో బాధ్యతగా పని చేయాలన్నారు. చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, గంటా వెంకటశివ, బీఎల్ కోటేశ్వరరావు లీగల్ సర్వీస్, గృహహింస, సివిల్ వివాదచట్టాలను వివరించారు.

నాగులగుడిలో వసంత పంచమి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగుల గుడి దేవాలయంలో శ్రీమహాసరస్వతి అమ్మవారి వసంత నవరాత్రుల సందర్భంగా గురువారం అమ్మవారికి కావడి ఉత్సవం నిర్వహించారు. పట్టణ వీధుల్లో కావడి ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు గుడె నాగసతీష్ పాల్గొన్నారు.

దాచేపల్లిలో బీజేపీ కార్యాలయం ఏర్పాటు

దాచేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలో బీజేపీ కార్యాలయాన్ని పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ ప్రారంభించారు. గురువారం దాచేపల్లిలోని తంగెడ బస్టాండ్ వద్ద కార్యాలయంలో ప్రారంభోత్సవంలో వల్లెపు కృపారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కొప్పుల వెంకటేశ్వర్లు, గురజాల నియోజకవర్గ కన్వీనర్ ఆరే వెంకటేశ్వర్లు, మనోజ్, జనసేన పార్టీ నాయకులు అంబటి మల్లి, పాముల కిషోర్, మాచవరం, పిడుగురాళ్ళ, గురజాల మండలాలకు చెందిన కూటమినేతలు హాజరయ్యారు.

గ్రానైట్ లారీని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

ముప్పాళ్ళ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ లారీని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. లారీ నరసరావుపేట నుండి సత్తెనపల్లి వైపు వెళుతుండగా అధికారులు తనిఖీజేసి బిల్లులు లేకపోవడంతో కేసునమోదు చేసి ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌లో అప్పజెప్పారని ఎస్‌ఐ సోమేశ్వరరావు గురువారం తెలిపారు.

150 రోజులకు పని దినాలు పెంచాలి

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కూలీల పనిదినాలను వందరోజుల నుంచి 150రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వీ శివనాగరాణి అన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పల్నాడు జిల్లా కార్మిక సంఘం చేపట్టిన బైక్ యాత్ర మండలంలోని కట్టమూరు, రెంటపాళ్ళ, ఫణిదం, గుడిపూడి, నందిగం గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనాలు ఆలస్యమైతే వడ్డీతో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో సంఘం జిల్లా కార్యదర్శి వీ రవిబాబు, జిల్లా నాయకులు భగత్, ఏపూరి వెంకటేశ్వర్లు, దాసరి పేతురు, దుగ్గి సుజాత, కొలకలూరి మార్కు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 517.80 అడుగులు ఉంది. ఇది 145.29 టీఎంసీలకు సమానం. కుడికాల్వ ద్వారా 3031 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 5297, ప్రధాన జల విద్యుత్‌కేంద్రం ద్వారా 4032, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 14,460 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 30.14 టీఎంసీల నీటి నిల్ల ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఎంపీడీవో వెంగళరావు



మాచవరంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంగళరావు తదితరులు

మాచవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు, మాచవరం సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో వెంగళరావు తెలిపారు. గురువారం ఆయా కేంద్రాలను ఆయన పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా జీరో నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఆధార్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఆధార్ లేకపోవటం వల్ల ప్రభుత్వ పథకాలు వర్తించవని తెలిపారు.

మరలా వస్తా.. అన్నీ మారాలి

● కస్తూర్బా పాఠశాలలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తనిఖీ

వెల్దుర్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మరలా వస్తా.. అన్నీ మారాలి అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. గురువారం వెల్దుర్తిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. వంటశాలను, సరుకులు, కూరగాయలను పరిశీలించారు. వసతి, ఆహార నాణ్యత, విద్యాబోధనపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. హెచ్‌ఎం గంగా భవానిబాయికి పలు సూచనలు చేశారు. మరలా వచ్చే సరికి ఆయా మార్పులను చేయాలన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల కొరకు ఎమ్మెల్యేకి హెచ్‌ఎం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.



వంటశాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పురిటిగడ్డ రుణం తీర్చుకోవాలి

దుర్గి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పురిటిగడ్డ రుణం తీర్చుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని కోలగుట్లలో సుమారు రూ.కోటితో నూతనంగా నిర్మించిన యండ్లపల్లి చంద్రమౌళి, అరుంధతి కమ్యూనిటీ హాల్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా మారిన యండ్లపల్లి కుటుంబాన్ని అభినందించి సన్మానించారు. కార్యక్రమలో యండ్లపల్లి కుటుంబసభ్యులు, గ్రామ పెద్దలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వేసవిలో పట్టణంలోని ప్రజలు, ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్, డీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాలూకా సెంటర్, అమరావతి బస్టాండ్ సెంటర్, కోర్టు ఆవరణలో మంచినీటి చలివేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, సయ్యద్ పెద కరిముల్లా, నూర్ బాషా జాన్‌బాబు, మర్రి వెంకటరామిరెడ్డి, ఆతుకూరి నాగేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్, ఎంపీ చలపతిరావు, పూజల వెంకటకోటయ్య, బత్తుల ఆదినారాయణ, గుజ్జర్లపూడి స్టాలిన్, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ సాంబయ్య, నోముల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, కేబీఆర్‌జే ప్రసాదు, పెద్దింటి చంద్రయ్య, పోతులూరయ్య పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా యువతకు ఉపాధి

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాజకీయాలకు అతీతంగా యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో అమరరాజా సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత ప్రపంచస్థాయి ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచకపాలనతో యువత రోడ్డునపడ్డారని ఎమ్మెల్యే అన్నారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వ పాలన ప్రారంభమైన అతితక్కువ సమయంలోనే పరిశ్రమలకు స్వర్గధామంగా ఇక్కడ చక్కదిద్దుతున్నారన్నారు. పల్నాడు ప్రాంతం పారిశ్రామికంగా పురోగమించేందుకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఎంపీతో కలిసి ఎన్నో పరిశ్రమల స్థాపనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జాబ్‌మేళాకు 600మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకోగా 380మంది ఉద్యోగాలు సాధించారు. వీరికి ఎమ్మెల్యే ధ్రువపత్రాలను అందించారు.



ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ఓటర్ల జాబితాపై అశ్రద్ధ వద్దు

● డిప్యూటీ కలెక్టర్ గాయత్రీదేవి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ గాయత్రీదేవి

మాచర్లటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు ఓటర్లజాబితాపట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ గాయత్రీదేవి అన్నారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వోలతో గురువారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఓటర్లజాబితా తయారీలో బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించాలని తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబులకు సూచించారు. అనంతరం బీఎల్‌వోలకు పరీక్షలు నిర్వహించారు.

ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించాలి

పెదకూరపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసుకొనేలా వీఆర్‌వోలు అవగాహన కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి ఎం ఉమాదేవి అన్నారు. పెదకూరపాడులోని షాదీఖానాలో గురువారం బూత్ లెవల్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతుల పేర్లు ఓటరు లిస్టుల నుంచి బీఎల్‌వోలు తొలగించేలా చూడాలన్నారు. నియోజకవర్గంలోని 265మంది బీఎల్‌వోలు శిక్షణలో పాల్గొన్నారు. పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ, అచ్చంపేట తహసీల్దార్లు నీలి ధనలక్ష్మి, డానియేలు, జే అస్రిపున్నీసా, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాయపాలెంలో రీసర్వే గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ జే మున్నీసా బేగం

బెల్లంకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో గురువారం రీసర్వే గ్రామసభను నిర్వహించినట్టు తహసీల్దార్ జే మున్నీసాబేగం పేర్కొన్నారు. గ్రామసభలో రైతులు తమ సమస్యలను అధికారుల ముందుంచారు. రైతులు ఇచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ బాషా, వీఆర్‌వోలు, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నరుకుళ్లపాడులో చలివేంద్రం ఏర్పాటు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకుళ్లపాడు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటుచేశారు. చలివేంద్రాన్ని జీడీసీసీబీ మేనేజర్ సుధీర్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ సీఈవో పీ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ గోపి పాల్గొన్నారు.

విజయపురిసౌత్ ఫిల్టర్ హౌస్ వద్ద..

మాచర్ల రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ ఫిల్టర్ హౌస్ వద్ద ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ చలివేంద్రాన్ని టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బొబ్బిలి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ నేత ఊరే మార్కు, కట్టా రాజు, రాంచంద్, శ్రీను పాల్గొన్నారు.

పెదకూరపాడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోగా కోటమ్మ

పెదకూరపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోగా పీ కోటమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంకొండలో ఏపీవోగా పనిచేస్తున్న కోటమ్మ బదిలీపై వచ్చారు.

బెల్లంకొండకు వెంకటేశ్వర నాయక్...

బెల్లంకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండల ఉపాధి హామీ పథకం ఏపీవోగా వెంకటేశ్వరనాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన మాచవరం మండల ఏపీవోగా పని చేస్తూ బెల్లంకొండ మండలానికి బదిలీపై వచ్చారు.

నకరికల్లుకు ప్రసాదు..

నకకరికల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఏపీవోగా జీ ప్రసాదు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రసాదు చిలకలూరిపేట నుంచి బదిలీపై నకరికల్లుకు వచ్చారు. క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

బెల్లంకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతవరం లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని గురువారం జరిగింది. కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, ఆలయ ఈవో వెంకటేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ పాశం నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం

మాచర్లటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యాన పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు పట్టణంలోని మండాది రోడ్డులో గల స్వామివివేకానంద సేవాశ్రమంలో పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ఈ కోచింగ్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి, యువనేత జూలకంటి అక్కిరెడ్డిలు ప్రారంభించారు. ముందుగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మెట్ట గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్లటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయాల వద్ద విద్యుత్ స్తంభాల మార్పు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్‌ఎంయూ నేతల నిరసన

మాచర్ల రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపో వద్ద ఎన్‌ఎంయూ నేతలు గురువారం తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. సస్పెన్షన్లు, తొలగింపు లేకుండా 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, పదోన్నతులు చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారానే కొనాలని, నైట్‌ఔట్ అలవెన్స్ రూ.150నుంచి రూ.400కు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నేతలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలి

● ఎంపీడీవో సరోజనిదేవి

రెంటచింతల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని ఎంపీడీవో కె.సరోజనిదేవి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవోగా బాధ్యతలు చేపట్టిన జి.వెంకటేశ్వర్లు, బదిలీపై వెళ్తున్న జయచంద్రలను సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి వారం లేబర్ ఇంప్రూవ్‌మెంట్ వుండాలని ఆదేశించారు. కూలీల హాజరుశాతం, ఆన్లైన్ నమోదు పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఏలు ఆర్.సామ్యానాయక్, గాలయ్య, కొండలు, ప్రసాద్, వంశీ, టీఏ భాస్కర్ నాయక్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు స్వాధీనం

● పోలీసుల అదుపులో ఇరువురు

రెంటచింతల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండలం గోలివాగు సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిన కారుతోపాటు నిందితులు ఇరువురిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. గత నెల 31వ తేదీన ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కాశిబోయిన పున్నారావును టీఎస్29జి 8123 నంబరు గల కారులో తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, పాలకీడు మండలం, నాగిరెడ్డిగూడెంకు చెందిన కసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అతని సోదరుడి కుమారుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు మాచర్ల వస్తూ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు పున్నారావుకు చేయి, కాలు విరిగాయి. కారు ఆపకుండా మాచర్ల కొత్తపల్లి జంక్షన్ సమీపంలోని లేఅవుట్‌లో కారును వదిలిపెట్టి పరారయ్యారు. పోలీసులు గురువారం ఉదయం కారు తీసుకెళ్లేందుకు వచ్చిన వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డిలను అదుపులోకి తీసుకొని కారును కూడా రెంటచింతల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ నాగార్జున దర్యాప్తు చేస్తున్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో గురువారం ఆర్డీవో మురళీకృష్ణ బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఫారం 6, 7, 8, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై తగు సలహాలు, సూచనలు చేశారు. తహసీల్దార్ నగేష్, కమిషనర్ శివన్నారాయణ, నియోజకవర్గ పరిధిలోని 304 మంది బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు శిక్షణలో పాల్గొన్నారు.



పిన్నెల్లికి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిన్నెల్లికి బస్సు సౌకర్యం ఏర్పాటు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రజల ఆదరణ పొందేలా అన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యాలను ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోరారు. గురువారం పిడుగురాళ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో పిన్నెల్లికి పల్లెవెలుగు బస్సు సర్వీసును, పిడుగురాళ్ల నుండి విజయవాడ వరకు మరో ఎక్స్‌ప్రెస్ సర్వీసును ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. మాచవరం మండలం పిన్నెల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తుల కోరిక మేరకు ఏర్పాటుచేస్తున్నామని, ఆర్టీసీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, పిల్లి చెన్నారావు, గండికోట వెంకటేశ్వర్లు, ఎల్‌వీఆర్, తురకా వీరస్వామి, పణితి రవి, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, డిపో మేనేజర్ రామకోటేశ్వరరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● స్థానిక మార్కెట్‌యార్డు వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ట్యాక్సీ స్టాండ్‌ను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. పిడుగురాళ్ల లైట్ మోటార్ వెహికల్ డ్రైవర్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ట్యాక్సీడ్రైవర్లు, ఓనర్లు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు.

మృతులకు యరపతినేని నివాళులు

బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీలో ఇటీవల మృతిచెందిన టీడీపీ నాయకుల చిత్రపటాలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసిపోగు వజ్రమ్మ, పోలేపల్లి పేరయ్య, బీసిపోగు రాయేలు, కొండ్రు సీమోను గృహాలకు వెళ్లి వారి చిత్రపటాలకు నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం బ్రాహ్మణపల్లి మెడికల్ కళాశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటుచేసిన మద్రాస్ ప్రీమియం కాఫీ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, గండికోట వెంకటేశ్వర్లు, మామిళ్ల అనిల్, కిషోర్, నాగమల్లి, శివ, పూసల శ్రీను పాల్గొన్నారు. అనంతరం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో జానపాడు ఆర్‌టీబీ నిర్మాణం గురించి అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్, డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాఘవేంద్ర, ఆర్‌అండ్‌బీ ఏఈ యూసుఫ్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

● విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయకుమార్



విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీలో ఎస్‌ఈ విజయకుమార్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆ శాఖ ఎస్‌ఈ విజయకుమార్ అన్నారు. రూరల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో గురువారం పట్టణ, గ్రామీణ పరిధిలోని విద్యుత్ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని, పెండింగ్ పనులు పూర్తిచేయాలన్నారు. కరెంట్ బిల్లుల వసూలులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో లోడు పెరగనున్నదని, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. 50 శాతం అదనపు లోడు సబ్సిడీ స్కీంను గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిచారు. అనంతరం పట్టణ పరిధిలోని జానపాడు, రూరల్ పరిధిలోని జూలకల్లు సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఎస్‌ఈ వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీ నాగసురేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింగయ్య తదితరులు ఉన్నారు.

న్యూ క్యాటగిరి విజేత పల్నాడు జిల్లా

బెల్లంకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని కందిపాడు గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి తిరునాళ్ళ సందర్భంగా నిర్వహించిన ఆంధ్రా, తెలంగాణా పశుబల ప్రదర్శనలో చివరి రోజున న్యూ క్యాటగిరి విభాగంలో మొదటి స్థానంలో పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామానికి చెందిన సంపటం వీరబ్రహ్మేంద్ర నాయుడుకు చెందిన ఎడ్ల జత నాలుగు వేల అడుగులు లాగి మొదటి స్థానం సాధించింది. తెలంగాణా రాష్ట్రం కోదాడ గ్రామానికి చెందిన జక్కుల సహస్ర యాదవ్, డాక్టర్ హుస్సేన్ కంబైన్డ్ ఎడ్ల జాత 3,802.2 అడుగులు లాగి రెండవ స్థానం సాధించింది. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ యామని రామారావు ఎడ్ల జత 3600 అడుగులు లాగి, అదే విధంగా పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన సూర్య అషివిక్ యాదవ్, బత్తుల చినబ్బాయి యాదవ్ కంబైన్డ్ ఎడ్లజత 3600 అడుగులు మూడవ స్థానం సాధించాయి. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, బండి పల్లెకొండ, శ్రీహరిరావు, శ్రీనివాసరావు, ప్రభురాజు, గంగాధర్, గోవర్ధన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలి

పెదకూరపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నెలల తరబడి వేతనాలు రావటం లేదని ఉపాధి హామీ కూలీలు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం బైక్ యాత్ర బృందం గురువారం పెదకూరపాడు, బలుసుపాడు, పరస, 75 తాళ్ళూరు, లగడపాడు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలు పనులు చేసి నెలలు గడుస్తున్నా తమకు వేతనాలు ఇవ్వటం లేదని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వెంటనే వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భగత్, ఏపూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

● ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు

రెంటచింతల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లనువేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ సీహెచ్ శ్రీనివాసరావు కోరారు. గురువారం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంకా రూ.19.27లక్షలు వసూలు చేయాల్సివుందన్నారు. సమావేశంలో కార్యదర్శులు కోటేశ్వరరావు, వెంకయ్య, సుబ్బారావు తదితరులున్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

● పీఏసీఎస్ చైర్‌పర్సన్ స్వరూప

మాచర్లటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ సీహెచ్ స్వరూప అన్నారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో పీఏసీఎస్ ఆధ్వర్యాన గురువారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంకు చీఫ్ మేనేజర్ కరుణాకర్‌బాబు, మేనేజర్ బలరాంరెడ్డి, సూపర్‌వైజర్ టీసీహెచ్ అంజిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ టీ నరసింహారావు, సీఈవో ఇనకంటి కోటయ్య, సూపరింటెండెంట్ షేక్ రహంతుల్లా, సోమరౌత బ్రహ్మేశ్వరరావు, రాజసాగర్ రెడ్డి, కోటిరెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వరూప

జలకాలాటలలో..

వేసవి నుంచి ఉపశమనం పొందడానికి యువకులు, విద్యార్థులు పంట కాలువల్లో ఈతకొడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు... ఈతల్లో విన్యాసాలు చేస్తూ ఆనందోత్సాహాలతో మై మరిచిపోతున్నారు.... స్థానిక బుడంపాడు రోడ్డులోని గుంటూరు చానల్‌లో ఇలా ఈతకొడుతున్నారు. -గుంటూరు (ఆంధ్రజ్యోతి)








అరచేతిలో పుర సేవలు

పురమిత్ర యాప్‌తో సులభంగా సమస్యల పరిష్కారం



సత్తెనపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని సమస్యలు వెంటనే పరిష్కారం కావటం లేదు. రోజుల తరబడి సమయం పడుతుంది. దరఖాస్తు చేయాలంటే పురపాలక సంఘ కార్యాలయానికి వెళ్ళాలి. గంటల తరబడి వేచి ఉండి అర్జీలు అందించాలి. ఇటువంటి తరుణంలో ప్రజల సమస్యలు సులభంగా పరిష్కరించుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అరచేతిలో పుర సేవలు పొందేలా ప్రభుత్వం పుర మిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు ఇంట్లోనే కూర్చొని పురపాలక సేవలు పొందేలా వీలు కల్పించింది. ఈ యాప్‌లో పలు రకాల సేవల వల్ల పట్టణంలో 50వేల మంది సులభంగా సేవలు పొందవచ్చు. సమస్యకు సంబంధించిన చిత్రాన్ని తీసి ఫోన్ పెట్టి వాయిస్ రికార్డుల్లో పంపాలి. సమస్య సమాచారం సంబంధిత విభాగం అధికారికి చేరుతుంది. కనీసం మూడు నుంచి 30 రోజుల లోపు పరిష్కరిస్తారు.

ప్లే స్టోర్‌లో

పుర మిత్ర యాప్‌ను గుగూల్ ప్లే స్టోర్‌లో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. దీనిని నేరుగా డౌన్‌లోడ్ చేసుకొని లాగిన్ కావచ్చు. రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, ఇంజనీరింగ్, అకౌంట్స్, పరిపాలన విభాగాలకు సంబంధించిన 150 రకాల పౌర సేవలను పొందు పరిచారు. ఇతర ప్రాంతాల్లో స మస్యనైనా అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళవచ్చు. ప్రజలు పంపిన సమస్యలను అధికారులు సకా లంలో పరిష్కరించాలి. ఏం చర్యలు చేపట్టారో ఫోటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వినతి పరిష్కారంలో పురోగతి సమీక్షించు కోవచ్చు. అధికారి స్పందించక పోతే పైస్థాయి అధికారికి చేరుతుంది. అక్కడి నుంచి అపరిష్కృత జాబితాలో పడుతుంది. సంబంధిత అధికారిని బాధ్యుడిని చేస్తారు.

సమస్య ఏదైనా...

సమస్యలను ప్రజలు అధికారులకు తెలియ జేసేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్ళాల్సిన అవసరం లేదు. పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు వంటి ఏ సమస్యనైనా ఈ యాప్ ద్వారా తక్షణం అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళవచ్చు. జనన, మరణ ధ్రువ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, పన్ను చెల్లింపులు, నీటి పన్ను, లైసెన్స్ రెన్యువల్, సీవరేజ్ పన్ను, లీజ్ అండ్ అగ్రిమెంట్ ఫీజు వంటివి ఇందులో పొందవచ్చు.

మూడేళ్లయినా.. తప్పటడుగులే

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దె చాలక సొంతంగా చెల్లించాల్సిన దుస్థితి చాలా మంది అధికారులు ఎదుర్కొంటున్నారు. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, కలెక్టర్, ఎస్పీ నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని కార్యాలయా లకు నేటికి కనీసం పర్నిచర్ కూడా ఇవ్వలేదు. కార్యాలయాలకు కనీస వసతులు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చిక్కుముడులు వీడేనా..

గత ప్రభుత్వం ఆదరాబాదరాగా జిల్లాలు ఏర్పాటు చేయడంతో అనేక సాంకేతికపరమైన చిక్కులు కూడా ఇమిడి ఉన్నాయి. ఒక అధికారి రెండు పోస్టులను నిర్వహించాల్సి ఉండటంతో వారు ఏ విభాగానికీ న్యాయం చేయడంలేదు. సరిపడా సిబ్బంది లేకపోవడం, ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొన్ని ఖాతాలు నిర్వహిస్తున్నారు. మెప్మా, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, యువజన సర్వీసుల వంటి విభాగాలన్నీ ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతున్నాయి. కొన్ని విభాగాలకు చెందిన అధికారులకు అయితే గుంటూరులోని ప్రధాన కార్యాలయాల నుంచే జీతాలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో గెజిటెడ్ హోదా కలిగిన జిల్లా అధికారులు లేక అధికారులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా ఏర్పాటు సమయంలో సాంకేతికంగా ఉన్న చిక్కులను తొలగించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా జిల్లా పోస్టుల భర్తీకి ప్రతిబంధకంగా ఉన్నట్లు సమాచారం. కార్యాలయాల్లో సిబ్బం ది అయితే ఉండాల్సిన నిష్పత్తిలో ఏ ఒక్క విభాగంలోనూ లేరు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం ఆచరణలో రాకపోగా పలు ప్రభుత్వ విభాగాలకు అద్దె భవనాలే ఇప్పటికీ దిక్కుగా ఉన్నాయి. ఇలాంటి ఎన్నింటినో సరిచేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ప్రణాళిక లేకుండా వైసీపీ కొలువుదీర్చిన జిల్లాలను గాడిలో పెడతామని కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో హా మీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మెరుగుపడతాయని అటు యంత్రాంగం, ఇటు ప్రజలు ఆశించారు. అయితే పది నెలలైనా జిల్లా సమస్యలపై ప్రభుత్వం విధానాన్ని ప్రకటించలేదు. అయితే ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. కొత్త జిల్లాల అధికారులకు పూర్తి పాలనా పరమైన వెసులుబాటు కల్పించడంతో పాటు సమీకృత కలెక్టరేట్ నిర్మాణం కూడా పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే ఎప్పటికి సమస్యలు పరిష్కారమవుతాయో చూడాలి.

ఎయిర్ ట్యాక్సీ సృష్టి కర్తకు సీఎం ప్రశంస



సీఎం చంద్రబాబుతో ఎయిర్ ట్యాక్సీ సృష్టి కర్త, మ్యాగ్నమ్ వింగ్స్ సీఈవో అభిరామ్ చావా

గుంటూరు సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ ట్యాక్సీ సృష్టి కర్త, మ్యాగ్నమ్ వింగ్స్ సీఈవో అభిరామ్ చావాను సీఎం చంద్రబాబు నాయుడు అభినందించారు. సీఎం చంద్రబాబును అభిరామ్ చావా గురువారం సచివాల యంలో కలిశారు. తాను ఆవిష్కరించిన ఎయిర్ ట్యాక్సీ గురించి సీఎంకు వివరిం చారు. ఎయిర్ ట్యాక్సీలు గుంటూరులో తయారు కావటం పట్ల చంద్రబాబు నాయుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎయిర్ ట్యాక్సీ వివరాలు, సెక్యూరిటీ ఫీచర్స్ తయారీకి అయిన ఖర్చు వంటి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రెండుసీట్ల సామర్థ్యంతో ఈ ఎయిర్ ట్యాక్సీని తయారు చేశానని అభిరామ్ వివరించారు. ఉన్నత స్థాయి చదువులు చదివి దేశానికి సేవ చేసేందుకు ముందుకు వచ్చిన అభిరామ్ నేటి యువతరానికి స్ఫూర్తి దాయకం అని సీఎం అభినందించారు. ఈ ప్రాజెక్టుకు సివిల్ ఏవియేషన్ అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పరంగా కేంద్రంతో మాట్లాడి సహకారం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.. ఈ పరిశోధనలు కొనసాగించాలని అభిరామ్‌కు సీఎం సూచించారు.

రాజమండ్రి చిత్ర కళా వీధికి తెనాలి శిల్పాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రిలో అమరావతి చిత్ర కళా వీధి పేరుతో ఏర్పాటు చేస్తున్న ప్రదర్శనకు తెనాలి శిల్పాలు తరలిను న్నాయి. తెనాలి ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తున్న వినూత్న శిల్పాలను ఇందుకోసం



శిల్పులు రూపొందించిన శిల్పాలు

ఎంపిక చేశామని శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ వినూత్న శిల్పాలను విశ్రాంత ఎస్పీ సత్యనారాయణమూర్తి, కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం సందర్శించారు. గ్యాలరీలో ఏర్పాటు చేసిన పలు శిల్పాలను సందర్శించి శిల్పులను అభినందించారు. రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరిగే ప్రదర్శనలో 500లకు పైగా ఆర్ట్ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పనికి రాని ఇనుప వస్తువులతో రూపొందించిన సింహం, పులి, జింక, తేలు, నెమలి వంటి పలు శిల్పాలను ప్రదర్శనలో పెట్టనున్నట్లు శిల్పులు శ్రీహర్ష, రవిచంద్ర తెలిపారు.

పల్నాడులో.. అకాల వర్షం



గురజాల మండల పరిధిలో మిర్చి పంటపై కప్పిన పట్టలు

గురజాలటౌన్, మాచర్లటౌన్, వెల్దుర్తి, మాచవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో గురువారం ఉన్నట్టుండి వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు చినుకులు పడగా మరికొన్ని ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా కారు మబ్బులు కప్పి ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. మిర్చి పంట చేతికొచ్చే సమయంలో వర్షం కురవడంతో రైతులు పొలాలకు పరుగులు తీశారు. ఒకవైపు దిగుబడి తగ్గి, మరోవైపు గిట్టుబాటు ధర కూడా లేక ఆవేదనతో ఉన్న రైతులను అకాల వర్షం మరింత ఆందోళనకు గురి చేసింది. అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయలు తాలుకాయలుగా మారితే ఎవరూ కొనరని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసుకున్న రైతులు మిర్చిని కల్లాలకు చేర్చుకున్నారు. కల్లాల్లోని దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు పట్టల కోసం పరుగులు పెట్టాల్సి వచ్చింది. కొంత మంది రైతులకు పట్టలు కప్పే సమయం లేకపోవడంతో వర్షం నీటితో మిర్చి తడిసిపోయింది. పలు ప్రాంతాల్లోని రహదారులపై వర్షపునీరు పారింది.

- మాచర్ల ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం గంటకుపైగా పడింది. పొలాల్లో మిర్చి కోతలు కోసేందుకు వచ్చిన వ్యవసాయ కూలీలు తడిసి ముద్దయ్యారు. కల్లాల్లో ఉన్న మిర్చిని తరలించేందుకు వచ్చిన లారీలు కూడా పొలాల్లోనే నిలిచిపోవాల్సి వచ్చింది.
- వెల్దుర్తి మండల పరిధిలో ఈదురు గాలులతో కురిసిన వర్షం రైతులను హడలెత్తించింది. గాలుల ఉధృతికి కల్లాలపై పట్టలను కప్పడానికి రైతులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.
- మాచవరం మండలం వేమవరం, చెన్నాయ పాలెం తదితర గ్రామాల్లో సాయంత్రం నాలుగు నుంచి 5 గంటల మధ్యలో చిరు జల్లులు కురి శాయి.పొలాల్లో ఆర బోసిన మిర్చి, మొక్క జొన్న, పొగాకు దిగుబడులను వర్షం నుంచి కాపాడు కునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.



వెల్దుర్తి మండలంలో వర్షంతో తడిచిన మిర్చి

ఇసుక రీచ్‌లకు టెండర్లు నిర్వహించాలి

● డీఎల్‌ఎస్‌సీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుమతులు లభించిన ఇసుక రీచ్‌లకు త్వరగా టెండర్లు నిర్వహించి ఏజెన్సీలను ఖరారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మైనింగ్ అధికారులు ఆదేశించారు. ఆ వెంటనే ఇసుక తవ్వకాలు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఇసుక కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో రాయపూడిలో పూడిక తొలగింపు పనులను బోట్స్‌మెన్ సొసైటీకి కేటాయించడం, బొమ్మువానిపాలెం-16 ఓపెన్ ఇసుక రీచ్, గుండిమెడ ఓపెన్ శాండ్ రీచ్, కృష్ణానదిలో హైడ్రోగ్రాఫిక్



కలెక్టరేట్‌లో జరిగిన డీఎల్‌ఎస్‌సీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

సర్వే నిర్వహణ, అబ్బరాజుపాలెం/బోరుపాలెం, లింగాయపాలెం అండ్ రాయపూడి, తాళ్లాయపాలెంలకు ఇన్‌ఛార్జ్‌ల నియామకం అంశాలపై చర్చించారు. రాయపూడి డీసిల్టేషన్ పాయింట్ పర్యవేక్షణ ఏ శాఖ పరిధిలోకి వస్తుందో రాష్ట్ర మైనింగ్ అధికారులను సంప్రదించి తెలుసుకోవాలని మైనింగ్ అధికారిని ఆదేశించారు. బొమ్మువానిపాలెం - 16 ఓపెన్ ఇసుక రీచ్ మైనింగ్ ప్లాన్‌ను రూపొందించి టెండర్ షెడ్యూల్‌ని సిద్ధం చేయాలన్నారు. ఈ రీచ్ 21.80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. మైనింగ్ ప్లాన్ మెస్సర్స్ జియో మైనింగ్ సర్వీసెస్ రూపొందించినందున రాయల్టీ ఇన్‌స్పెక్టర్ దానిని తెప్పించి ఆమోదం తీసుకోవాలన్నారు. గుండిమెడ రీచ్‌కు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బిడ్‌లు ఆహ్వానించి ఏప్రిల్ 16వ తేదీ నాటికి అర్హత గల ఏజెన్సీని ఎంపిక చేయాలన్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇసుక నిల్వలు అంచనా వేసేందుకు హైడ్రో గ్రాఫిక్ సర్వే కోసం ఈఈ, కేసీ కెనాల్ డివిజన్‌కు జిల్లా వాటా కింద రూ. 24 లక్షలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక సరఫరా చేసే కేంద్రాల వద్ద పర్యవేక్షణ కోసం సంబంధిత తహసీల్దార్ల ద్వారా రెవెన్యూ ఉద్యోగులను మైనింగ్ అధికారులు నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ, డీఆర్‌వో ఎస్‌ఎస్‌కే కాజావలి, మైనింగ్ జిల్లా ఇన్‌ఛార్జ్ అధికారి నాగిని, ఆర్‌టీవో జీఎస్ ప్రసాదు, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, కేసీ డివిజన్ ఈఈ రవికిరణ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎండీ నజీమ బేగం, తహసీల్దార్లు సిద్ధార్థ, సీతారామయ్య, సునీత పాల్గొన్నారు.

ఉండవల్లిలో.. మన ఇల్లు - మన లోకేశ్

● ఎన్నికల హామీకి శ్రీకారం చుట్టిన మంత్రి ● గోవిందు కుటుంబానికి తొలి పట్టా పంపిణీ



లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న స్థానిక మహిళలు

తాడేపల్లి(ఉండవల్లి), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో మంగళగిరిలో లోకేశ్ గెలిస్తే ఇల్లు పీకేస్తారని ప్రచారం చేశారు. అలా ప్రచారం చేసిన వారే అధికారం చేపట్టిన తర్వాత మంగళగిరి పరిధిలో చాలా ప్రాంతాల్లో ఇళ్ల కూల్చేసి పలువురిని నిరాశ్రయులను చేర్చారు. ఈ క్రమంలో మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న దశాబ్దాల సమస్యకు పది నెలల్లో మంత్రి లోకేశ్ పరిష్కారం చూపారు. మన ఇల్లు - మన లోకేశ్ పేరుతో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న మూడు వేల మందికి శాశ్వత పట్టాలను లోకేశ్ అందజేయనున్నారు. ఈ క్రమంలో తొలుత గురువారం ఉండవల్లి గ్రామం అమరారెడ్డినగర్‌లోని రాజమండ్రి గోవిందు, సీతామహలక్ష్మి ఇంటికి వెళ్లిన లోకేశ్ స్వయంగా మొదటి శాశ్వత ఇంటి పట్టాను అందజేశారు. దంపతులకి నూతన వస్త్రాలతో పాటు ఇంటి పట్టాను అందించారు. కొద్దిసేపు వారితో ముచ్చటించి, చిన్నారులను ఎత్తుకొని ఆడించారు. స్వయంగా తమ ఇంటికి వచ్చి శాశ్వత ఇంటి పట్టా అందజేయడంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిన ఆ కుటుంబసభ్యులు లోకేశ్‌కు పాయసం ఇచ్చి ఆనందాన్ని పంచుకున్నారు.

మా చిత్తశుద్ధికి నిదర్శనం

గతంలో చెప్పినట్లుగానే మొదటి పది నెలల్లోనే పేదలకు శాశ్వత పట్టాలు ఇవ్వడం మా చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి లోకేశ్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టా విలువ రూ.9.5 లక్షలన్నారు. అటవీ భూముల్లోని నివాసితులకు కొంత సమయం పడుతుందన్నారు. 150 గజాలలోపు మొదటి విడత ఇస్తున్నామన్నారు. రెండో విడతలో రైల్వేవి ఉంటాయని చెప్పారు. ఉండవల్లి పెనుమాక గ్రామాలలో భూగర్భ డ్రెయినేజీ, కరెంటు ఇతర సదుపాయాలు, అమరావతి డెవలప్‌మెంట్ కింద చేస్తామన్నారు. కామన్ ఫెసిలిటి సెంటర్ జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్క్‌కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. త్వరలో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. స్వచ్ఛతలో మంగళగిరిని దేశంలోనే మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తామన్నారు. కుప్పం, హిందూపురం మాదిరి మంగళగిరిని టీడీపీకి కంచుకోటలా మారుస్తామన్నారు. అంతకముందు లోకేశ్ తమ ప్రాంతానికి రాగానే పలువురు మహిళలు దిష్టి తీసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.



రాజమండ్రి గోవిందు కుటుంబీకులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అనాథ శవానికి అంత్యక్రియలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కారంపూడి రోడ్డులో అనారోగ్యంతో మృతిచెందిన గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహానికి మానవసేవా సమితి సభ్యులు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ సురేష్‌బాబు మాట్లాడుతూ కరోనా సమయంలో మానవా సేవా సమితి, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొని అనాథ శవాలకు అంత్యక్రియలు జరిపి మానవత్వాన్ని చాటుకున్నారని ఈ సందర్భంగా వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పువ్వాడ కృష్ణ, షేక్ సత్తార్ నాగూర్, సయ్యద్ జాబిర్, కోటి, ప్రసాద్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ చేపట్టామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. జనవరి-6 నుంచి ఇప్పటి వరకు ఓటర్ల జాబితా సవరణలో భాగంగా అన్నిరకాల దరఖాస్తులు 2995 దాఖలయ్యాయి. వీటిలో నూతన ఓటర్లు-296, తొగింపులు.. 2280, మార్పులకు సంబంధించి 416లుగా ఉన్నాయని పీ అరుణ్‌బాబు వివరించారు. కలెక్టరేట్‌లో గురువారం ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సంఘం నిర్దేశించే మార్గ దర్శకాలను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు ప్రతి నెలా జరిగే సమావేశంలో తెలియచేయడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని, అదేవిధంగా ఆయా పార్టీలు పోలింగ్ బూతుల వారీగా ఏజంట్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళి, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి 6 వరకు గడువు పొడిగింపు

చిలకలూరిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలలో 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7,8 తరగతులలో మిగిలి ఉన్న ఖాళీలకు, జూనియర్ కళాశాలలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలలో మొదటి సంవత్సరం డిగ్రీలో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల దాఖలుకు గడువు తేదీని ఈ నెల 6వ వరకు పొడిగించినట్లుగా ఆ సంస్థ డైరెక్టర్, కార్యదర్శి వీఎస్ మస్తానయ్య గురువారం తెలిపారు.

తల్లీకూతుళ్లపై దాడి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 3, (ఆంధ్రజ్యోతి), తల్లీకూతుళ్లపై పట్టణానికి చెందిన కొందరు దాడి చేసినట్లు మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని సిరి అపార్టుమెంటులో నివాసమున్న అమర సుధారాణి, ఆమె కుమార్తెపై బుధవారం పట్టణానికి చెందిన ఏలూరు ప్రసాద్, కూరపాటి గుప్తా కొత్తూరు సురేష్ పెనుగొండ ప్రభాకర్,పెనుగొండ ప్రతాప్ తదితర పదిమంది వ్యక్తులు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి దాడిచేసినట్లు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

234 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు: జేసీ

నరసరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీలో ఉత్పత్తయ్యే ధాన్యం కొనుగోలుకు 234 రైతులు సేవా కేంద్రాల్లో కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు జాయింట్ కలెక్టర్ సూరజ్ గురువారం తెలిపారు. 20,501 హెక్టార్లల్లో ధాన్యం సాగుచేశారని, 1,32,773 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2320, గ్రేడ్ బీ రకం క్వింటా రూ.2300 కొనుగోలు చేస్తామన్నారు. ఈ పంట నమోదు అయిన రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులకు ధాన్యం కొనుగోలుపై నిబంధనల మేర అన్ని విధాలుగా సమాయత్తం కావాలన్నారు. ప్రభుత్వ కనీస మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు.

రుణమేళాకు 567 మంది హాజరు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థికసంవత్సరానికి గాను బీసీ, ఈబీసీ, కాపు, జనరక్ ఫార్మసీ రుణ అర్హత మేళ కార్యక్రమాన్ని కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రుణమేళాలో బీసీలకు-47, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డిలకు 24 యూనిట్లు ఉండగా మొత్తం 567మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు కమిషనర్ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి

రొంపిచర్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన రొంపిచర్ల డీఆర్‌డీఏ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్యూమరేటర్లకు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామాల్లోని గ్రూపు సభ్యులతో మాట్లాడి వార్షిక ప్రణాళిక తయారుచేయాలన్నారు. తద్వారా వారు ఎంచుకున్న ఉపాధి రంగానికి ప్రభుత్వం చేయూత అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం హనుమా నాయక్, ఏపీఎం చంద్రశేఖర్, సీసీలు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

వినుకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు స్థానిక జాషువా కళా ప్రాంగణంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు అధ్యక్షతన బీఎల్వోలకు ఎన్నికల జాబితాపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో వినుకొండ తహశీల్దార్ ఎస్.సురేష్, నూజండ్ల తహశీల్దార్ రమేష్, బొల్లాపల్లి తహశీల్దార్ సుధాకర్, ఈపూరు తహశీల్దార్ నళిని, శావల్యాపురం తహసీల్దార్ సుజాత, మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

గృహకల్ప భవనాలను వినియోగంలోకి తీసుకొస్తాం

● 50వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం
● స్వయం ఉపాధి సంఘాలకు సాయం
● రూ 185.42 కోట్ల వ్యయంతో ఉపాధి పనులు
● జిల్లాలో 15శాతం వృద్ధి రేటు లక్ష్యం
● కలెక్టర్ అరుణ్‌బాబు వెల్లడి



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావు పేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నరసరావుపేటలోని రాజీవ్ స్వగృహ భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని కలెక్టర్ పీ అరుణ్‌బాబు స్పష్టం చేశారు. స్వగృహం.. శిథిలం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం వెలవడిన కథనంపై కలెక్టర్ స్పందిస్తూ ఈ భవనాలను వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. రాజీవ్ స్వగృహ భవనాలను ఉద్యోగుల వసతికి వినియోగించే అంశం పరిశీలనలో ఉందన్నారు. కార్యాలయ భవనాలు.. ఉద్యోగుల వసతి అంశాలను త్వరలోనే పరిష్కారం చూపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం 50వేల ఎకరాలకు పెంచడమే లక్ష్యంగా నిర్దేశించామన్నారు. స్వయం ఉపాధి సంఘాల మహిళలకు అదనపు పశువుల కొనుగోలుకు ఆర్థికసాయం అందిస్తామన్నారు. కోళ్ల ఫారాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, జిల్లాలో నిలిచిపోయిన కోళ్ల ఫారాలు తిరిగి ప్రారంభించేందుకు సహకారం అందించనున్నట్టు చెప్పారు. జిల్లాలో ఉద్యాన రంగంలో పండ్లు, కూరగాయలు, పూల తోటల విస్తీర్ణం పెంచడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. డిసెంబర్ నుంచి మార్చి కాలంలో షేడ్ నెట్లు నిరుపయోగంగా మారుతున్నాయని, ఆ సమయంలో సైతం మొక్కల పెంపకం చేపడితే అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. పశువుల పెంపకం, పాల ఉత్పత్తి, మాంసం ఉత్పత్తిలో ప్రగతి సాధించేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించడంతో పాటు చేపల పెంపకాన్ని ప్రోత్సహించనున్నామన్నారు. అన్ని అనుమతులు పొంది వివిధ కారణాలతో నిలిచిపోయిన పరిశ్రమలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నియోజకవర్గంలో హోటల్ ఏర్పాటు

పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా ప్రతి నియోజక వర్గ కేంద్రంలో ఒక కొత్త హోటల్ ఏర్పాటుచేయడం లక్ష్యమన్నారు. జిల్లాకు వచ్చే పర్యాటకులు రెండు, మూడు రోజుల్లో ఇక్కడే ఉండటానికి వసతుల కల్పన చేయాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలవనున్నామన్నారు. ఉపాధి హామీ పథకంలో పంచ ప్రాధాన్య కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. రూ 185.42 కోట్ల వ్యయంతో ఉపాధి పనులు చేపడుతున్నట్టు వివరించారు. వేసవిలో పశువులకు ఇబ్బంది కలగకుండా 343 నీటితొట్లు నిర్మిస్తామన్నారు. రానున్న 15 పనులు పూర్తవుతాయన్నారు. ప్రస్తుతం ఏడు చెరువుల్లో 25-50 శాతం, 32 చెరువుల్లో 50-75 శాతం నీటి లభ్యత ఉందన్నారు. 6253 కి.మీ మేర కాల్వల్లో పూడికతీత పనులు చేపడతామన్నారు. ఇప్పటికే గ్రౌండింగ్ అయిన 1100 పంట కుంటలను జూన్ 8నాటికి పూర్తి చేస్తామన్నారు. మొత్తం 6500 ఫారం పాండ్ల నిర్మాణం లక్ష్యమన్నారు. ఉపాధి కూలీల వేతనం రూ.300కి తగ్గకుండా అందేలా పనులు, పని వేళలు కేటాయించనున్నామన్నారు.

బర్డ్ ఫ్లూపై ఆందోళన వద్దు

నరసరావుపేటలో నమోదైన బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు. బర్డ్ ఫ్లూ కేసు నమోదైన ప్రాంతంలో అధికారులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి లేదని, ప్రజలు అప్రమత్తతలో భాగంగా పూర్తిగా ఉడికించిన చికెన్ తినడం వంటి వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవిలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సౌకర్యార్థం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మినరల్ వాటర్ అందుబాటులో ఉంచామన్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో జిల్లా అవసరాల గురించి రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించడం జరిగిందని, జిల్లా సమస్యల పరిష్కారం, అభివృద్ధికి సహకారంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కలెక్టర్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 15శాతం వృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టనున్నామని ప్రధానంగా ఉద్యాన పంటలు, పశుపోషణ, పర్యాటక రంగాలలో అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడంపై దృష్టి సారిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యడ్లపాడులో నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో 22వ జాతీయ స్థాయి నాటికల పోటీలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై మూడు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఈ వేదికపై ప్రదర్శన చేయనున్నారు. కళానిలయం అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ముత్తవరపు రామారావు, ఉపాధ్యక్షుడు జరుగుల శంకర రావు, కోశాధికారి నూతలపాటి కాళిదాసు, ఇతర సభ్యులు పోటీలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రతిరోజు సాయంత్రం 7 గంటలకు నాటిక ప్రదర్శనలు ప్రారంభం అవుతాయి. తొలి రోజు మూడు, రెండో రోజు నాలుగు, మూడో రోజు మూడు నాటికల చొప్పున మొత్తం 10 నాటికలు ప్రదర్శిస్తారు.

వేల్పూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

వేల్పూరు (శావల్యాపురం) ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి నుంచి మండలంలోని వేల్పూరుకు వెళ్ళే రోడ్డుప్రక్కన రూ.4.50కోట్లుతో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఎట్టకేలకు గురువారం ప్రారంభించారు. గతేడాది మార్చి 6వ తేదీన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పనులు పూర్తికాకుండా ప్రారంభించారు. దీంతో అది ఇప్పటివరకు వినియోగంలోకి రాలేదు. నరసరావుపేట ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబొట్లు, కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామసుబ్బారావు గురువారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈఈ రాంబొట్లు మాట్లాడుతూ వేల్పూరు సబ్‌స్టేషన్ నిర్మాణంతో వినియోగదారులకు లోవోల్టేజీ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఇర్లపాడు గ్రామానికి విద్యుత్ స్తంభాలు వేశామని త్వరలో విద్యుత్ తీగలు అమర్చి సరఫరా ఇస్తామన్నారు. శావల్యాపురం సబ్‌స్టేషన్ నుంచి వేల్పూరు సబ్‌స్టేషన్ వరకు జాతీయ రహదారి ప్రక్కన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వేల్పూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు త్వరలో 24గంటల త్రీఫేస్ కరెంట్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. వినియోగదారులు ఏవైనా సమస్యలుంటే 9281034240 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ వెంకటేశ్వరరెడ్డి, ఏఈ నటరాజ్, ఎల్ఐ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలి


● జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డి



నాదెండ్లలో అధికారులు, కార్యదర్శులతో మాట్లాడుతున్న గ్రామీణ పంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డి

నాదెండ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని బుక్కాపురం, జంగాలపల్లి, ఎండుగుంపాలెం, నాదెండ్ల గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బుక్కాపురంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో పంచాయతీ కార్యదర్శికి మెమో జారీచేశారు. అదేవిధంగా ఎండుగుంపాలెం గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి నిర్వాహణ లోపంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శికి మెమో జారీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ నిర్మల లక్ష్మీకుమారితో పాటు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. పారిశుధ్య నిర్వహణపై ఐడీఆర్ఎఫ్ ఫోన్ కాల్స్ వస్తున్నందున ప్రజల నుంచి స్పందన లభించేలాకృషి చేయాలని సూచించారు.

ఘనంగా పంచమ జ్యోతుల ఊరేగింపు



పంచమ జ్యోతుల ఊరేగింపులో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ళ సందర్భంగా నిర్వహించిన పంచమ జ్యోతుల ఊరేగింపు కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. జ్యోతులను తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయనతో పాటు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మాజీ సర్పంచ్ మోదుగుల నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, జాష్టి బుచ్చారావు, అయినాల కోటేశ్వరరావు, దండే సురేష్, కోటి, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పోటీలలో యడ్లపాడు విద్యార్థుల ప్రతిభ

యడ్లపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌డేను పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన యురేకా సైన్స్ ఎక్స్‌పో పోటీలలో యడ్లపాడు విద్యార్థులు ప్రతిభ చూపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పర్యావరణ విభాగంలో ప్రథమ బహుమతి పొందగా, యడ్లపాడు నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచారు. గురువారం స్థానిక నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈవో నాగరత్నం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ధూళిపాళ్ళ వెంకట్రావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, చిలకలూరిపేట డివిజన్ అధ్యక్షురాలు చెరుకూరి సృజన, జిల్లా ఉపాధ్యక్షులు చుక్కా విన్సెంట్‌పాల్, సలహాదారులు డాక్టర్ పీవీ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి కళాశాలలో ఇంటర్మీడియట్ (దూరవిద్య) మూల్యాంకన కేంద్రం

నరరసరావుపేట టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియట్ (దూరవిద్య) మూల్యాంకనం నరసరావుపేటలోని కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి కళాశాలలో జరుతుందని డీఈవో ఎల్ చంద్రకళ గురువారం తెలిపారు. ఏప్రిల్ 5, 6 తేదీలలో రెండు రోజులు నిర్వహించటం జరుగుతుందన్నారు. 11 సబ్జెక్టులలో సంబంధించిన జవాబు పత్రాలు మొత్తం 16,215 క్యాంప్‌కు వచ్చాయన్నారు. మూల్యాంకనానికి ఎగ్జామినర్లుగా 191 మందిని, చీఫ్ ఎగ్జామినర్లులుగా 38మందిని, స్పెషల్ అసిస్టెంట్ లుగా 39 మందిని నియమించటం జరిగిందన్నారు.

7 నుంచి ఇంటర్మీడియట్ (దూరవిద్య) ప్రాక్టికల్ పరీక్షలు

కాగా పల్నాడు జిల్లా సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూప్ వారికి ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 7 నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని డీఈవో ఎల్ చంద్రకళ అన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు, సాయంత్రం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. సత్తెనపల్లి గవర్నమెంట్ జూనియర్ కళాశాల, వినుకొండ గవర్నమెంట్ జూనియర్ కళాశాల, నరసరావుపేటలోని హార్డ్ జూనియర్ కళాశాల, శ్రీ సుబ్బరాయ నారాయణ జూనియర్ కళాశాల, కేఆర్ జూనియర్ కళాశాల, ఎస్‌కేఆర్‌బీఆర్ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఫిజికల్ సైన్స్‌లో 1282మంది, కెమిస్ట్రీలో 1286 మంది, బయోలజీలో 33మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నరని డీఈవో వివరించారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

చిలకలూరిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో గురువారం పారా లీగల్ వలంటీర్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ముఖ్య అతిథిగా సంస్థ చైర్మన్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు. శిబిరంలో రిసోర్స్ పర్సన్స్‌గా పి.వెంకటేశ్వరరావు, జీవీహెచ్ఎస్ ప్రసాద్, టి.రామాంజనేయులు, యం.భానుప్రసాద్, వై.శ్రీనివాసరావు పాల్గొని వివిధ చట్టాల గురించి వివరించారు.

● నరసరావుపేట లీగల్: ఇటీవల ఎంపికైన పల్నాడు జిల్లాకు చెందిన పారా లీగల్ వలంటీర్లకు గురువారం 13వ అదనపు జిల్లా కోర్టులో న్యాయాధికారి ఎన్.సత్యశ్రీ శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన కల్పించాలన్నారు.

చిలకలూరిపేటలో అరుదైన శస్త్రచికిత్స

చిలకలూరిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జానకీ నర్సింగ్ హోమ్‌లోని డాక్టర్ బలరామకృష్ణ లివర్ అండ్ గ్యాస్ట్రో సెంటర్లో గురువారం ఎండోస్కోపీ విధానంతో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. స్థానిక పురుషోత్తమపట్నంకు చెందిన 70ఏళ్ల వృద్ధురాలు కడుపునొప్పితో ఆసుపత్రికి రాగా వైద్యులు పరీక్షించి, పసరుపేగులో రాళ్ళు, చీము ఉన్నట్టు గుర్తించారు. అప్పటికే ఆమెకు గుండె, ఊపిరితిత్తుల సమస్య ఉన్నట్టు కూడా కనుగొన్నారు. ఎంతో రిస్క్‌తో ఉన్న ఈ శస్త్రచికిత్సను గ్యాస్ట్రో వైద్య నిపుణులు డాక్టర్ బలరామకృష్ణ తేజస్వి ఎండోస్కోపీ విధానంతో విజయవంతంగా పూర్తిచేశారు.

నరసరావుపేటలో వాహన తనిఖీలు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పట్టణంలో గురువారం డ్రంకెన్ డ్రైవ్, త్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం తదితర ఉల్లంఘనలపై నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 35 ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం: మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైన బిల్లు అని వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం అవుతాయని ముస్లింలు ఆందోళనలో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మతపరమైన బిల్లులు సవరణ చేసే సమయంలో ముస్లిం మత సంస్థలను చర్చలకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ముస్లింల ఓట్లతో గెలిచిన కూటమి ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకమైన చట్టాన్ని సమర్థించడం దారుణం అన్నారు. భారతదేశంలో ఉన్న జనాభాలో 16 నుంచి 20శాతం సుమారుగా 20కోట్ల మంది ముస్లింల మనోభావాలు దెబ్బ తినేలా ఉన్నాయన్నారు.

ముస్లింలకు వ్యతిరేకంగా కూటమి నిర్ణయాలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముస్లింల ఓట్లతో గద్దె నెక్కిన ఎన్డీఏ కూటమి భాగస్వాములు టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీ తీసుకుంటున్న వక్ఫ్ చట్ట సవరణ నిర్ణయాలకు మద్దతు ప్రకటించడం నమ్మించి ద్రోహం చేయటమేనని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ గురువారం విమర్శించారు. దేశంలో లౌకికవాదాన్ని కాపాడాలన్నా, భిన్నత్వంలో ఏకత్వం రాహుల్‌గాంధీ నాయకత్వంతోనే సాధ్యం అన్నారు.

తల్లిని చంపిన తనయుడు

బొల్లాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరులో తల్లిని రోకలి బండతో మోది చంపిన సంఘటన గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. సీఐ ప్రభాకర్ కథన ప్రకారం బుధవారం రాత్రి అందరూ కలసి భోజనం చేసే సమయంలో వెల్లటూరుకు చెందిన గజ్జ సోమమ్మ (65)కు కుమారుడు గజ్జ బాదరయ్యకు స్వల్ప విషయమై వాగ్వాదం జరిగింది. అది మనస్సులో పెట్టుకుని బాదరయ్య తెల్లవారు జామున 4 గంటల సమయంలో రోకలి బండతో సోమమ్మను కొట్టడంతో మృతిచెందింది. నిందితుడు పరారీలో ఉన్నాడని, సోమమ్మ మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రభాకర్ తెలిపారు. మృతురాలికి భర్త నరసయ్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

నగదు రహిత వైద్యం అందించాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ రోగులకు బిల్లులు లేకుండా నగదు రహిత వైద్యం అందించేలా ఆసుపత్రి యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధ్యక్షతన డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో 30ఫిర్యాదులను కమిటీ సభ్యులు విచారణచేసి అందులో డబ్బులు వసూలు చేసిన రెండు ఆసుపత్రులకు జరిమానా విధించారు. సమావేశంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బీ రవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర జీ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి కొత్త బస్సులను ప్రారంభిస్తున్న చీఫ్ విప్ ఆంజనేయులు

ఆర్టీసీని ప్రజలకు చేరువచేయడమే లక్ష్యం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సులను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి గురువారం ఆయన ప్రారంభించారు. జీవీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ వాహనాల వైపు ఆర్టీసీని నడిపించడం ద్వారా భవిష్యత్తులో ప్రజలపై చార్జీల భారం తగ్గుతుందని, కాలుష్య సమస్యలు లేకుండా ఉంటాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 1489 కొత్త బస్సులు ప్రారంభించారన్నారు. త్వరలో మరో 1400 కొత్త బస్సులు రానున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగుసార్లు ఆర్టీసీ చార్జీలు పెంచినా ప్రయాణికులకు, కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని, డిపోలను మెరుగుపరచలేకపోగా ఆర్టీసీ ఆస్తులను అమ్మేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. వినుకొండలో కొత్త ఆర్టీసీ డిపో నిర్మాణానికి రూ.17కోట్లు అవసరమని అంచనాలు వేసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళామని, త్వరలో డిపో నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఆర్ఎం మధు, డీఎం నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

కార్మిక పరిషత్ కార్యాలయం ప్రారంభం

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మించిన కార్మిక పరిషత్ నూతన కార్యాలయాన్ని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర కార్మిక పరిషత్ అధ్యక్షుడు శేషగిరిరావులతో కలసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నేత యార్లగడ్డ లెనిన్‌కుమార్, జనసేన నేతలు నాగశ్రీను రాయల్, న్యాయవాది సైదారావు, కార్మిక పరిషత్ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు జీవీ పరామర్శ

వినుకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై నరసరావుపేటలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ను, బొల్లాపల్లి మండలం హనుమాపురం గ్రామానికి చెందిన గోపాలనాయక్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు గురువారం పరామర్శించారు. జీవీతో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జానీ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఈపూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన మండలంలోని కొచ్చెర్ల చెరువు సమీపంలో మూలమలుపు వద్ద గురువారం జరిగింది. యర్రబాలెం గ్రామానికి చెందిన ఏ అంకమ్మరావు మోటార్ బైక్‌పై వినుకొండ నుంచి వస్తుండగా చెరువు కట్ట వద్ద మూలమలుపులో అడ్డువచ్చిన కుక్కను తప్పించబోయి రోడ్డుపై పడిపోయాడు. ప్రమాదంలో కాలుకు గాయాలయ్యాయి. మూలమలుపు వద్ద కల్లు దుకాణం వద్ద వేసే మాంసం కోసం కుక్కలు వస్తున్నాయి. కల్లుకోసం వచ్చేవాళ్ళు రోడ్డుపైనే మోటార్ బైక్‌లు పెడుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపించారు.

కుట్టు శిక్షణకు బీసీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలి

నాదెండ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణకోసం బీసీ వర్గాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో స్వరూపరాణి కోరారు. 18 నుంచి 50 సంవత్సరాల లోపు వయస్సు మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వీరికి 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఉచితంగా అధునాతనమైన కుట్టు మిషన్లను అందించటం జరుగుతుందని వివరించారు.

బాల సంజీవినిలో సవరణలు చేయాలని అంగన్‌వాడీల వినతి

వినుకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి బాలసంజీవని కొత్త వర్షన్ 2.0లో సవరణ చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీ తదితర సంఘాల నేతలు గురువారం గుంటూరులోని శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాల రెడ్డి, ఆర్జేడీను కలసి వినతిపత్రాన్ని అందజేసినట్లు వినుకొండ పట్టణ నాయకురాలు శారమ్మ తెలిపారు. కార్యక్రమంలో సుప్రజ, రమాదేవి, లలితా, ప్రేమ, భారతి తదితరులు పాల్గొన్నారు.